# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

**Bullet Edition**

సోమవారం 26 జనవరి 2026 www.prajaswaramdailly.com 3 PM


## గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్

**హైదరాబాద్, ప్రజాస్వరం**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యాంగం స్వేచ్ఛతో పాటు ప్రతి పౌరుడికి న్యాయం, సమానత్వం, గౌరవం కల్పించిందని గుర్తుచేస్తూ, ప్రజాస్వామిక, గణతంత్ర, లౌకిక, సామ్యవాద, సార్వభౌమ దేశంగా భారతదేశం ప్రగతి పథంలో దూసుకెళ్లాలని ఆకాంక్షించారు. అందుకు ఆధారమైన రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26 న దేశ ప్రజలందరికీ గొప్ప పండుగని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడం, సమ్మిళిత అభివృద్ధిని వేగవంతం చేయడం, జాతీయోద్యమ నాయకులు, రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ, ప్రజాహిత కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. రాజ్యాంగ నిర్మాతల దార్శనికతకు, గణతంత్రాన్ని తీర్చిదిద్దిన త్యాగమూర్తులకు ఈ సందర్భంగా సీఎం నివాళులర్పిస్తూ, యోధుల ఆకాంక్షలకు అనుగుణంగా దేశ సేవకు పునరంకితమవుదామని పిలుపునిచ్చారు.







## కర్రెగుట్టల్లో పేలిన ఐఈడీలు

**10 మంది జవాన్లకు గాయాలు**

**కర్రెగుట్ట, ప్రజాస్వరం**

కర్రెగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన ఐఈడీలు పేలి 10 మంది భద్రతా సిబ్బంది గాయపడ్డారు. భద్రతా సంస్థలకు విశ్వసనీయ సమాచారం అందడంతో కూంబింగ్ చేపట్టారు. ఆదివారం సాయంత్రం అనేక ఐఈడీలు ఒకదాని తర్వాత ఒకటి పేలాయి. దీంతో జవాన్లు గాయపడ్డారు. వారిని ఆర్మీ హెలికాప్టర్‌లో రాయ్‌పుర్‌కు తరలించారు. వీరిలో 9 మంది డీఆర్‌జీ, మరొకరు కోబ్రా బెటాలియన్‌కు చెందినవారు. గాయపడిన భద్రతా సిబ్బందికి ప్రాణాపాయం తప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కర్రెగుట్టల్లో హైఅలర్ట్ ప్రకటించి కూంబింగ్ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. గతేడాది ఇదే ప్రాంతంలో 21 రోజుల పాటు దేశంలోనే అతిపెద్ద మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ నిర్వహించిన విషయం తెలిసిందే.



## గ్లోబల్ స్కిల్ హబ్‌గా తెలంగాణ

### ఇదే ప్రభుత్వ లక్ష్యం ... గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

### సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు

### వేడుకల్లో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

**హైదరాబాద్, ప్రజాస్వరం**

తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ స్కిల్ హబ్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఇప్పటి వరకు 62 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని వివరించారు. మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా తెలంగాణ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. రైజింగ్ తెలంగాణ–2047 సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుందని తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనికుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అమర జవాన్లకు గవర్నర్, సైనికాధికారులు నివాళులర్పించారు. ఈ వేడుకల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డిలు పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం ఇటీవలే తెలంగాణ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించిందని పేర్కొన్నారు. హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేలా తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ ఉందన్న ఆయన, రాష్ట్రాన్ని మూడు ఎకానమీ జోన్లుగా విభజించారని గుర్తు చేశారు.

భూ వివాదాలు పరిష్కరించే విధంగా భూభారతి చట్టం తెచ్చినట్లుగా గవర్నర్ వివరించారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ధాన్యానికి బోనస్‌గా రైతులకు రూ.1,780 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు. సన్నవడ్లపై క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్‌ను చెల్లిస్తున్నామన్నారు. 26 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు గుర్తు చేశారు. గతేడాది నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు గిన్నిస్ బుక్‌లో చోటు దక్కిందని పేర్కొన్నారు. రైతులకు 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్న గవర్నర్, మేడారం అభివృద్ధి కోసం రూ.251 కోట్లు కేటాయించామన్నారు.

ప్రతి నియోజకవర్గానికి 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లుగా పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నారని చెప్పారు. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. 27 ఎకరాల్లో రూ.2 వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామన్న ఆయన, విద్య, వైద్యాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యతలుగా తీసుకుందని జిష్ణుదేవ్ వర్మ తెలిపారు.

మహిళలు ఇప్పటికే రూ.200 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు చేశారని గవర్నర్ తెలిపారు. మహిళలను పెట్రోల్‌బంక్‌లు, ఆర్టీసీ అద్దె బస్సులకు యజమానులుగా చేశామన్నారు. బ్యాంక్ రుణాల ద్వారా మహిళలకు రూ.40 వేల కోట్లు సమకూర్చామన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు కార్యాచరణ చేపట్టామని వెల్లడించారు. 7,450 కి.మీ పంచాయతీ రోడ్లను ప్రభుత్వం అభివృద్ధి చేయనుందని తెలిపారు. తొలిదశలో రోడ్ల కోసం రూ. కోసం రూ.11,399 కోట్లు కేటాయించామన్నారు. హ్యామ్ విధానంలో 12 వేల కి.మీ. రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లుగా వెల్లడించారు. నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లుగా వివరించారు. హిల్ట్ పాలసీ ద్వారా కాలుష్య పరిశ్రమలను సిటీ వెలుపలకు తరలించనున్నట్లుగా తెలిపారు. చేనేత కార్మికులకు రూ.5లక్షల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. 27 ఎకరాల్లో రూ.2 వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నట్లుగా గవర్నర్ వివరించారు.



తెలంగాణ అసెంబ్లీ వద్ద గణతంత్ర వేడుకలు సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జాతీయ జెండా ఎగురవేశారు. ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. (హైదరాబాద్, ప్రజాస్వరం)

## రిపబ్లిక్ డే పరేడ్‌లో పురుషుల బృందానికి మహిళ నాయకత్వం

**ఢిల్లీ, ప్రజాస్వరం**

కర్తవ్యపథ్‌లో ఫోర్స్ బ్యాండ్ వాయించిన 'దేశ్ కే హమ్ హై రక్షక్' అనే సీఆర్‌పీఎఫ్ గీతానికి అనుగుణంగా బృందం కవాతు చేసింది. గతంలోనూ గణతంత్ర పరేడ్‌లోని బృందాలకు మహిళా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ నాయకత్వం వహించినప్పటికీ.. పూర్తిస్థాయిలో పురుషుల బృందానికి ఓ మహిళ నాయకత్వం వహించడం ఇదే మొదటిసారి.

ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన గణతంత్ర వేడుకల పరేడ్‌లో 26 ఏళ్ల సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సిమ్రన్ బాలా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గణతంత్ర దినోత్సవ కవాతులో పారామిలిటరీ దళానికి చెందిన పురుషుల బృందానికి ఆమె నాయకత్వం వహించి, చరిత్ర సృష్టించారు. దేశంలోనే అతిపెద్ద పారామిలిటరీ దళానికి చెందిన 147 మంది పురుష సిబ్బంది బృందాన్ని ఆమె ముందుండి నడిపారు.

జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీలో పాక్ సరిహద్దుకు 11 కిలోమీటర్ల దూరంలోని నౌషెరా గ్రామంలో జన్మించిన సిమ్రన్ జమ్మూలోని గాంధీనగర్‌లో ఉన్న ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి రాజకీయ శాస్త్రంలో పట్టభద్రురాలయ్యారు. ఏడాది



కిందటే సీఆర్‌పీఎఫ్ దళంలో చేరారు. ఆ జిల్లా నుంచి పారామిలిటరీ దళంలో ఆఫీసర్ హోదాలో చేరిన మొదటి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం ఆమె ఛత్తీస్‌గఢ్‌లోని 'బస్తారియా' బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

## ప్రత్యేక ఆకర్షణగా బాక్ట్రియన్ ఒంటెలు

**ఢిల్లీ, ప్రజాస్వరం**

పరేడ్‌లో ప్రత్యేక ఆకరణగా బాక్ట్రియన్ ఒంటెలు నిలిచాయి. ఆర్మీకి చెందిన బాక్ట్రియన్ ఒంటెలకు రెండు వీపు మూపురాలు ఉండడం ప్రత్యేకత. 15 వేల అడుగుల ఎత్తులో సైతం ప్రయాణించగలవు. మైనస్ డిగ్రీల చలిలోనూ 250 కిలోల బరువును మోయగలవు కూడా.





రిపబ్లిక్ డే సందర్భంగా ములుగు క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. (ములుగు, ప్రజాస్వరం)



పరేడ్ గ్రౌండ్స్ అమరవీరుల స్థూపం వద్ద గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాళులు అర్పించారు. (హైదరాబాద్, ప్రజాస్వరం)

## గణతంత్ర దినోత్సవ వేళ విషాదం

బాన్సువాడ,ప్రజాస్వరం

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని బోర్లం ఎస్సీ గురుకుల పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లకు కుర్చీలు దించుతుండగా ఆటో కింద పడి 8వ తరగతి విద్యార్థిని సంగీత అక్కడికక్కడే మృతి చెందింది. విద్యార్థిని మద్నూరు మండలం కోడిచిర గ్రామానికి చెందిన బాలికగా గుర్తించారు. ఘటనాస్థలికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

